
సాక్షి
మహబూబాబాద్

ఆదివారం | 18 | మే | 2025



హోరాహోరీగా నెట్‌బాల్ పోటీలు

జనగామ జిల్లా కేంద్రంలోని బతుకమ్మకుంటలో నెట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి.

- 8లో▸



లోకోపైలెట్ల గైర్హాజరుతో రైళ్లు రద్దు

కాజీపేట జంక్షన్ కేంద్రంగా ప్రయాణిస్తున్న పలు రైళ్లు లోకోపైలెట్ల గైర్హాజరుతో రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం

39.4^0 / 22.9^0

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. పలు ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై మోస్తరు వర్షం కురుస్తుంది.

న్యూస్‌రీల్

ధాన్యం తరలింపు వేగంగా చేపట్టాలి



డోర్నకల్/కురవి: కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం నిల్వల తరలింపు ప్రక్రియ వేగంగా చేపట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి విజయ నిర్మల ఆదేశించారు. సీరోలు మండల కేంద్రంతోపాటు ఉప్పరిగూడెం, మన్నెగూడెం గ్రామాల్లోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ఆమె పరిశీలించారు. ధాన్యం తరలింపునకు అవసరమైన లారీలు, గోనె సంచుల వివరాలను అందించాలని ఆదేశించారు. ఇప్పటి వరకు కేంద్రాలకు వచ్చిన లారీలు, గోనె సంచుల లెక్కలను తెలుసుకున్నారు. అవసరముంటే గోనె సంచులు, లారీలకు ఇండెంట్ ఇవ్వాలని ఆమె నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో సీరోలు వ్యవసాయ అధికారి ఛాయారాజ్, ఏఏఓ ఎర్ర కర్ణ పాల్గొన్నారు. సీరోలు ఇన్‌చార్జ్ తహసీల్దారు కృష్ణవేణి తదితరులు ఉన్నారు.

పామాయిల్ చెట్ల నరికివేత

డోర్నకల్: సీరోలు మండలం మన్నెగూడెం గ్రామంలోని ఓ పామాయిల్ తోటలోని 80 చెట్లను గుర్తు తె లియని వ్యక్తులు నరికివేశారు. డోర్నకల్ ఎస్సై వంశీధర్ శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. ఖ మ్మంకు శ్రీరామినేని వెంకటేశ్వర్లు మన్నెగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని తన ఐదెకరాల భూమిలో ఆయిల్‌పామ్ సాగు చేశాడు. మన్నెగూడేనికి చెందిన శ్యామల వెంకటేశ్వర్లును పాలేరుగా నియమించాడు. ఈక్రమంలో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తులు తోటలోని 80చెట్లను నరికేయడంతో పాలేరు.. యజమానికి తెలియజేశాడు. రూ.12 లక్ష ల నష్టం వాటిల్లిందని, వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కొనుగోలు కేంద్రంలో గోల్‌మాల్



మరిపెడ రూరల్: మండలం రాంపురంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జీవనజ్యోతి ధాన్యం కొనుగోలు కేంద్రంలో గోల్‌మాల్ చోటుచేసుకుంది. నిబంధనలకు విరుద్ధంగా కొందరు ట్రక్ షీట్లు పొందారని సెంటర్ నిర్వాహకులు సుధగాని నీలమ్మ, కంసాని జ్యోతి, పట్ల బాలమ్మ శుక్రవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో అడిషనల్ డీఆర్డీఓ జయశ్రీ శనివారం రైతుల సమక్షంలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో విచారణ చేపట్టారు. ఈక్రమంలో రాంపెల్లి రవి 284 బస్తాలు, రాంపెల్లి బుచ్చిరాములు 158, రాంపెల్లి కపిల్ 40, బొమ్మగాని రవి 295, దోమల సత్తెయ్య 233, దోమల సోమయ్య 292, రాంపెల్లి కార్తీక్ కపిల్ 108 మొత్తం 1410 బస్తాల ధాన్యం కొనుగోలు కేంద్రానికి రాకుండానే ట్రక్ షీట్లు ఇచ్చినట్లు తేల్చారు. కొనుగోలు కేంద్రంలోని ఎంట్రీ బుక్ పరిశీలించగా ఆరోపించబడిన రైతులకు సంబంధించి ధాన్యం ఎంట్రీ కాలేదని నిర్ధారించారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందించనున్నట్లు తెలిపారు. ఆరోపణ ఎదుర్కొంటున్నరైతులు మాత్రం తాము కష్టపడి ధాన్యం పండించామని, కేంద్రంలో చోటు లేకపోవడంతో తమ కల్లంలోనే ఆరబెట్టికున్నామని, అనంతరం ప్రైవేట్ వాహనాల ద్వారా అబ్బాయిపాలెం సాయి శ్రీనివాస ఇండస్ట్రీస్ రైస్ మిల్‌కు తరలించినట్లు వివరణ ఇచ్చారు. ఇదిలా ఉండగా.. ఆరోపణ ఎందుర్కొంటున్న రైతుల అకౌంట్‌లో డబ్బులు జమకాకుండా అధికారులు అప్రమత్తమైనట్లు తెలిసింది.

హాయి హాయిగా..



ఎండ తీవ్రత, ఉక్కపోతతో మనుషులు కూలర్లు, ఏసీలతో ఉపశమనం పొందుతున్నారు. కానీ, జంతువులు ఎండ తీవ్రతను తట్టుకోలేక అల్లాడుతున్నాయి. ఈక్రమంలో ఎండవేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు ఓ శునకం మానుకోట మున్సిపల్ పరిధిలోని జంతువుల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన నీటికుండిలో మునిగి ఇలా హాయిని పొందుతుంది. – నెహ్రూసెంటర్



దీపం వెలిగించిన యువతి, గోదావరి, ప్రాణహిత, అంతర్వాహిని సరస్వతి నదిలో పుష్కరస్నానాలు ఆచరిస్తున్న భక్తులు,



కాళేశ్వరాలయంలో కిక్కిరిసిన క్యూలైన్లు



తీపిజ్ఞాపకం: ఎడ్లబండిపై వెళ్తూ సెల్ఫీ తీసుకుంటున్న యువతి

పుష్కర సంబురం

సరస్వతి నదిలో మూడోరోజు లక్షన్నర మంది స్నానాలు

- పిండ ప్రదానాలు, పితృ దేవతలకు తర్పనాలు
- భక్తులతో కిటకిటలాడిన కాళేశ్వరాలయ క్యూలైన్లు
- డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్, తుని తపోవనం పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతిస్వామి పూజలు
- వర్షంతో బురదగా మారిన పార్కింగ్ స్థలాలు..



త్రివేణి సంగమం.. జన సంద్రమైంది. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు నదీమ తల్లికి నీరాజనం పలికారు. పుష్కర స్నానమాచరించి పునీతులయ్యారు. పిండ ప్రదానాలు చేసి పితృదేవతలకు తర్పనాలు వదిలారు. గోదావరి మాతకు దీపాలు సమర్పించారు. హారతి ఇచ్చి అండగా నిలవమంటూ మొక్కులు చెల్లించుకున్నారు. హర హర మహదేవ అంటూ ముక్తీశ్వరుడిని దర్శించుకున్నారు. శనివారం లక్షన్నర మంది భక్తులు పుష్కర స్నానాలు ఆచరించినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, పీఠాధిపతులు ప్రత్యేక పూజలు చేశారు.

– భూపాలపల్లి/కాళేశ్వరం

- వివరాలు 8లో▸



నదికి నవరత్నమాల హారతి ఇస్తున్న కాశీ పండితులు

పిట్టల్లా రాలుతున్నారు..

జిల్లాలో పెరుగుతున్న వడదెబ్బ మరణాలు

- ఇప్పటికే పది మందికి పైగా మృతి
- నిప్పులు కురిసే ఎండలో తప్పని పని
- ఉపాధి పని ప్రదేశాల్లో సౌకర్యాల లేమి




సాక్షి, మహబూబాబాద్: భానుడి ప్రతాపం రోజురోజుకూ పెరిగిపోతోంది. నిప్పులు కురిపించే ఎండలో తప్పని పరిస్థితిలో పనిచేస్తూ వడదెబ్బకు గురై జిల్లా వ్యాప్తంగా రైతులు, కూలీలు పిట్టల్లా రాలుతున్నారు. ఈ ఏడాదిలో ఇప్పటికే జిల్లాలో పదిమందికి పైగా వడదెబ్బతో మృతి చెందారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. అయితే వేసవి తీవ్రత ఎక్కువగా ఉన్నా.. వైద్యారోగ్యశాఖ, మున్సిపాలిటీ, ఇతర శాఖల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు, సహాయక చర్యలు అందించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఉపాధి పని ప్రదేశాల్లో వసతులు కల్పించకపోవడంతోనే మృతుల సంఖ్య పెరుగుతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పదిమందికి పైగా మృతి

జిల్లా వ్యాప్తంగా వడదెబ్బతో అస్వస్థతకు గురై రెండునెలల్లోనే పదిమందికి పైగా మృతి చెందారు. ఏప్రిల్ 15వ తేదీనన కొత్తగూడ మండలం వేలుబెల్లికి చెందిన బాసాని మల్లమ్మ, గార్ల మండలం జీవంజిపల్లి గ్రామానికి చెందిన బాదంపూడి సులోచన వడదెబ్బతో మృతి చెందారు. 21వ తేదీన తొర్రూరు మండలం చర్లపాలెం గ్రామానికి చెందిన హనుమాండ్ల ప్రేమలత, 22వ తేదీన నెల్లికుదురు మండలం మదనతుర్తి గ్రామానికి చెందిన బిర్రు వెంకన్న ఎండలో ధాన్యం ఆరబోసే పనిచేస్తుండగా.. ఎండదెబ్బ తగిలి మృతి చెందాడు. 28వ తేదీన మహబూబాబాద్ పట్టణంలో పనికోసం వచ్చిన బీహార్ కూలీ తులసి మిశ్ర వడదెబ్బతో మృతి చెందారు. 29వ తేదీన బయ్యారం మండలం కస్తూరినగర్‌కు చెందిన కేలోత్ రంగ్యా ఎండలో పనిచేస్తూ కుప్పకూపోగా.. చికిత్స అందించే లోపే మృతి చెందారు. మే 6వ తేదీన గార్ల మండలం అంబేడ్కర్ నగర్‌కు చెందిన అక్కి పార్వతి వడదెబ్బతో మృతి చెందారు. నర్సింహులపేట మండల కేంద్రం ఫీల్డ్ అసిస్టెంట్ తూడి మానిక్యం ఈనెల 11వ తేదీన ఉపాధి కూలీలతో పనిచేయిస్తూ వడదెబ్బతగిలి అస్వస్థతకు గురికాగా.. మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. 12వ తేదీన పెద్దవంగర మండలం పోచంపల్లి కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చిన గంట్ల శివారు సమ్మిడ్ కుంట తండాకు చెందిన గుగులోత్ కిషన్ వడదెబ్బతో మరణించారు. 14న గార్ల మండలం కొత్త పోచారం గ్రామానికి చెందిన గజ్జి యాకమ్మ ఉపాధి పనులకు వెళ్లి వడదెబ్బతో మృతి చెందారు. దీంతోపాటు వడదెబ్బకు గురై అనారోగ్యంతో బాధపడుతున్నారు, ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నవారు సైతం అనేకమంది ఉన్నారు.

కానరాని సహాయక చర్యలు

వేసవి ఎండల నేపథ్యంలో పనిచేసే ప్రదేశాల్లో వసతులు లేకపోవడం, వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించకపోవడంతోనే అత్యధిక మరణాలు చోటు చేసుకుంటున్నాయనే విమర్శలు వస్తున్నాయి. ప్రధానంగా ఉపాధి హామీ పని ప్రదేశాల్లో టెంట్లు, తాగునీటి వసతి కల్పించాలి. కానీ, జిల్లాలో అత్యధిక ప్రాంతాల్లో వసతులు లేవు. దీంతోపాటు కొనుగోలు కేంద్రాలకు విక్రయానికి తీసుకొచ్చిన ధాన్యం తేమ శాతం తగ్గడంకోసం ఆరబోస్తున్న రైతులు రోజులు తరబడి ఎండలో నిరీక్షించాల్సిన పరిస్థితి ఉంటుంది. మరికొన్ని కేంద్రాల్లో కొనుగోళ్లు, తరలింపు ఆలస్యం కావడం వంటి కారణాలతో రైతులు రోజల తరబడి ఆయా కేంద్రాల్లో ఎండలోనే ఉంటూ వడదెబ్బకు గురై ప్రాణాలు కోల్పోతున్నారు. ఇంతజరుగుతున్నా.. వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించడం, ప్రధాన కూడళ్ల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ, చలి వేంద్రాల ఏర్పాటు వంటి సహాయక చర్యలు చేపట్టడంలో అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారనే విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు చొరవ తీసుకొని సహాయక చర్యలు చేపట్టేలా చూడాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.



వారం రోజులుగా జిల్లాలో ఉష్ణోగ్రత వివరాలు (డిగ్రీల్లో..)

తేదీన	కనిష్టం	గరిష్టం
10	25	40
11	27	39
12	25	40
13	25	38
14	25	37
15	26	40
16	23	35
17	28	42

ఉమ్మడి జిల్లా రైల్వే ప్రాజెక్ట్‌ల సర్వేకు నిధులు

- 2025–26 కన్సాలిడేటెడ్ స్టేట్‌మెంట్‌లో స్పష్టత

కాజీపేట రూరల్: ఉమ్మడి వరంగల్ జిల్లాలో పలు రైల్వే ప్రాజెక్టుల నిర్మాణానికి సంబంధించిన ఫైనల్ లొకేషన్ సర్వేకు 2025–26 ఆర్థిక సంవత్సరం సంబంధించిన కన్సాలిడేటెడ్ బడ్జెట్‌లో కెటాయింపు చేసినట్లు శనివారం రైల్వే అధికారులు తెలిపారు.

ఏ ప్రాజెక్టుకు ఎంత అంటే..

- పెండ్యాల్–హసన్‌పర్తి బైపాస్‌లైన్ ఫైనల్ లొకేషన్ సర్వేకు రూ.64 లక్షలు, డోర్నకల్–మణుగూర్ డబ్లింగ్ 104కి.మీ థర్డ్‌లైన్ సర్వేకు రూ.2.08 కోట్లు, సికింద్రాబాద్–కాజీపేట మధ్య మూడో లైన్ సర్వేకు రూ.1.56 కోట్లు కేటాయించారు.
- సికింద్రాబాద్–కాజీపేట వరకు 85.48 కి.మీ డబ్లింగ్ లైన్ సర్వే కోసం రూ.1.71 కోట్లు, కాజీపేట–విజయవాడ క్వార్డర్ అఫ్‌లింగ్ 220 కి.మీ సర్వేకు రూ.4.40 కోట్లు, కాజీపేట–బల్లార్షా క్వార్డర్ అఫ్ లింగ్ 234 కి.మీ సర్వేకు రూ.4.68 కోట్లు, కాజీపేట–సికింద్రాబాద్ క్వార్డర్ అఫ్‌లింగ్ 120 కి.మీ రూ.2.40 కోట్లు, భూపాలపల్లి–కాజీపేట (హసన్‌పర్తి) కొత్తలైన్ 64 కి.మీ ఫైనల్ సర్వేకు రూ.1.60 కోట్లు ఇచ్చారు.
- ఘన్‌పూర్–రఘునాథ్‌పల్లి 17.2 కి .మీ మూడవ, నాల్గవ లైన్ సర్వేకు రూ.0.34 లక్షలు, మణుగూరు–రామగుండం కొత్త లైన్ సర్వేకు రూ.5 కోట్లు, కాజీపేట–ఘన్‌పూర్ మధ్య 21.25 కి.మీ మూడవ రైల్వే లైన్ సర్వేకు రూ.43 లక్షలు కేటాయింపులు చేశారు.
- వరంగల్ స్టేషన్ సమీపంలో కి.మీ. రైల్ ఓవర్ రైల్ (ఆర్వోఆర్) మంజూరుకు రూ.10 లక్షలు, కాజీపేట–వరంగల్ రూట్‌లో బైపాస్‌లైన్‌లో రైల్ ఓవర్ రైల్ (ఆర్వోఆర్)కు రూ. 75లక్షలు, డోర్నకల్‌లో 15 కి.మీ. ఆర్వోఆర్ సర్వేకు రూ.30 లక్షలు మంజూరు చేశారు.
- సికింద్రాబాద్–కాజీపేట మధ్య ప్రిలిమినరీ ఇంజనీరింగ్ కమ్ ట్రాఫిక్ 134 కి.మీ మూడవ లైన్ సర్వేకు రూ.52 లక్షలు, బల్లార్షా– కాజీపేట ప్రిలిమినరీ ఇంజనీరింగ్ కమ్ ట్రాఫిక్ 234 కి.మీ బల్లార్షా–కాజీపేట మధ్య నాల్గవ లైన్ సర్వేకు రూ.1.17 కోట్లు, కాజీపేట–విజయవాడ మధ్య నాల్గవ లైన్ 219 కి.మీ ప్రిలిమినరీ ఇంజనీరింగ్ కమ్ ట్రాఫిక్ రూ.1.10 కోట్లు నిధులు కేటాయించినట్లు రైల్వే అధికారులు తెలిపారు.
- కాజీపేట రైల్వే వ్యాగన్ షెడ్‌కు సంబంధించిన ఈ ఏడాది కావాల్సిన నిధులు కన్సాలిడేటెడ్ బడ్జెట్ కేటాయింపుల్లో పేర్కొనలేదని అధికారులు పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ అర్బన్: 2025–26 విద్యాసంవత్సరంలో కార్పొరేట్ జూనియర్ కళాశాలలో ప్రవేశానికి ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనార్టీ ఈబీసీ విద్యార్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి నరసింహస్వామి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్‌లో 7.0 జీపీఏ లేదా.. 400 మార్కులు, ఆపై గ్రేడు పొందిన విద్యార్థులు అర్హులని తెలిపారు. ప్రభుత్వ షెడ్యూల్ కులాల వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలు, కస్తూర్బా పాఠశాలు, ప్రభుత్వ, మున్సిపల్, జిల్లా పరిషత్, ఎయిడెడ్ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు, ప్రభుత్వ సంక్షేమ రెసిడెన్షియల్ స్కూల్స్, జవహర్ నవోదయ విద్యాలయాలు, బెస్ట్ అవైలబుల్ స్కీంలో చదివిన విద్యార్థులు ఈనెల 17 నుంచి 31వ తేదీవరకు వెబ్‌సైట్ httpr://telanganaepass.cgg.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. టెన్త్ మెమో, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, బ్యాంకు పాస్‌బుక్, అధార్, రేషన్ కార్డ్, పాస్ పోర్ట్ సైజ్ ఫొటో, ప్రభుత్వ షెడ్యూల్డ్ కులా వసతి గృహాల విద్యార్థులు 3 సంవత్సరాల బోనోఫైడ్ జతచేయాలని తెలిపారు.

అల్లుడిని కత్తితో పొడిచి చంపిన మామ

కేసముద్రం: కుటుంబ కలహాల కారణంగా ఓ అల్లుడిని కత్తితో పొడిచి మామ హత్య చేసిన ఘటన మండలంలోని ధర్మారంతండా జీపీలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన లూనావత్ బాల (35) హైదరాబాద్‌లోని లింగంపల్లిలో వాటర్ టాంకర్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కేసముద్రం మండలం ధర్మారంతండా జీపీకి చెందిన బానోత్ వీరన్న, కైలా దంపతుల కుమార్తె మౌనికతో 9 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు. ఈ క్రమంలో హైదరాబాద్‌లో భార్యభర్తల మధ్య గొడవలు కాగా 3 రోజుల క్రితం మౌనిక తల్లిగారింటికి వచ్చింది. తన భార్యను తీసుకెళ్లేందుకు బాల శనివారం ధర్మారంతండాకు వచ్చాడు. మరోసారి భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో మామ వీరన్న క్షణికావేశంలో కత్తితో అల్లుడి ఛాతిపై పొడిచాడు. బాలను స్థానికులు మానుకోట జనరల్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. సంఘటన స్థలాన్ని రూరల్ సీఐ సర్వయ్య, ఎస్సై మురళీధర్ రాజ్ పరిశీలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



బాల మృతదేహం

రక్తపోటుపై అవగాహన కల్పించాలి

- డీఎంహెచ్ఓ రవిరాథోడ్

నెహ్రూసెంటర్: పీహెచ్‌సీలు, ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల ద్వారా గ్రామాల్లో రక్తపోటు(బీపీ)పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు డీఎంహెచ్ఓ రవి రాథోడ్ తెలిపారు. ప్రపంచ రక్తపోటు(బీపీ) నివారణ దినోత్సవం సందర్భంగా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎప్పటికప్పుడు రక్తపోటును పరీక్షించుకుంటూ మందులు వాడడం ద్వారా నియంత్రణలో ఉంచుకోవచ్చని తెలిపారు. రక్తపోటు తనిఖీలు, ప్రాముఖ్యత, చికిత్స నివారణపై క్షేత్రస్థాయిలో ఆరోగ్య సిబ్బంది ప్రజలకు వివరించాలన్నారు. జీవన శైలిలో మార్పులు చేసుకోవడం, వాకింగ్, సైక్లింగ్, రన్నింగ్, యోగా వంటివాటితో రక్తపోటను అదుపులో ఉంచుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు నాగేశ్వర్‌రావు, సుధీర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, సారంగం, విజయ్‌కుమార్, మాస్ మీడియా అధికారి కొప్పు ప్రసాద్, ఆశా నోడల్ ఆఫీసర్ సక్కుబాయి, హెచ్ఈఓ వెంకటేశ్వర్‌రాజు, శారద, గీత, పురుషోత్తం, రామకృష్ణ, కేఎల్ఎస్ స్వామి, లోక్య, డీపీఓ నీలోహన, నీలిమా శ్వేత, అశోక్, అరుణ్, మనోహర్, సౌమిత, వసంత, త్రివేణి, సీహెచ్ఓ రవీంద్రకుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ రవిరాథోడ్

వడదెబ్బపై జాగ్రత్తలు పాటించాలి

పెద్దవంగర: వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటిస్తే మిమ్మల్ని మీరు రక్షించు కోవచ్చని డీఎంహెచ్ఓ రవి రాథోడ్ సూచించారు. శనివారం మండల కేంద్రంతోపాటు ఉప్పరగూడెంలో వైద్యసిబ్బంది చేపట్టిన వాక్సినేషన్ పరిశీలించారు. అంతకు ముందు మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీసీజీ, ఓపీవీ, పంటా వంటి వాక్సిన్‌లు క్రమం తప్పకుండా అందించాలని ఆదేశించారు. ఎంఎల్‌హెచ్‌పీలు మహిపాల్, మహేష్, ఏఎన్ఎంలు హరిత, నాగజ్యోతి, ఆశాలు, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఆందోళన చెందొద్దు

తొర్రూరు: ధాన్యం కొనుగోలుపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ప్రేమ్‌కుమార్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గత సీజన్ కంటే ప్రస్తుతం వడ్ల దిగుబడి పెరిగిందని, తద్వారా కొంత ఆలస్యం అవుతుందన్నారు. ప్రతి సెంటర్‌లో ఉన్న మొత్తం ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేస్తామని అన్నారు. లారీలు, డీసీఎం, ట్రాక్టర్లు అందుబాటులో ఉంచేందుకు, ప్రతి రైస్ మిల్లుకు ధాన్యాన్ని తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్: ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఈనెల 22 నుంచి 28వ తేదీవరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఫస్ట్ ఇయర్ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు ద్వితీయ సంవత్సరం పరీక్షలు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటాయన్నారు. జిల్లాలోని 14 పరీక్షా కేంద్రాల్లో మొదటి సంవత్సరం విద్యార్థులు 2,539 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 1,594 మంది పరీక్షలు రాయనున్నారని తెలిపారు. డీఐఈఓ మదార్, విద్యుత్ శాఖ ఎస్ఈ నరేష్, డీఎంహెచ్ఓ రవి రాథోడ్, తదితరులు పాల్గొన్నారు.

యువ వికాసం దరఖాస్తుల పరిశీలన వేగంగా పూర్తి చేయాలి

రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల పరిశీలన త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. దరఖాస్తుల పరిశీలన తర్వాత బ్యాంకర్లకు పంపాలని, అన్ని దరఖాస్తులు బ్యాంకర్లు, ఎంపీడీఓలతో పరిశీలన చేపట్టాలన్నారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్లపై అధికారులతో సమావేశం నిర్వహించారు. పెండింగ్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టిసారించి హార్డ్ కాపీలను అందచేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వీరబ్రహ్మచారి, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

నెల్లికుదురు: కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు పెట్టిన ధాన్యం బస్తాలను తరలించే విషయంలో అధికారులు అప్రమత్తంగా ఉంటూ రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. మండలంలోని మధనతుర్తి, ఎర్రబెల్లిగూడెం, నెల్లికుదురు గ్రామాల్లో సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాలను శనివారం కలెక్టర్ సందర్శించి రికార్డులను పరిశీలించారు. వరిధాన్యాన్ని త్వరగా కాంటాలు వేసి మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగులు, టార్పాలీన్లు అందుబాటులో ఉంచుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ఎర్రబెల్లిగూడెం సబ్‌సెంటర్‌ను సందర్శించి వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎండతీవ్రత, వడగాల్పులపై వైద్య సిబ్బందికి అవగాహన కల్పిచారు. మండల ప్రత్యేక అధికారి జినుగు మరియన్న, తహసీల్దార్ రాజు ఉన్నారు.


ఆయిల్‌పామ్‌తో అధిక లాభాలు



ఆలేరులో ఆయిల్ పామ్ పంటను పరిశీలిస్తున్న మరియన్న

నెల్లికుదురు: ఆయిల్‌పామ్‌తో అధిక లాభాలు పొందవచ్చని, బోరు బావులు ఉన్న రైతులు డిమాండ్ ఉన్న అయిల్ పామ్ పంటల సాగు చేసి అంతర పంటలుగా పండ్లు, కూరగాయలు, పూలు, మల్బరీ వంటి ఉద్యాన పంటల సాగుతో లాభాలు పొందాలని జిల్లా ఉద్యాన వన, పట్టు పరిశ్రమల శాఖ అధికారి జినుగు మరియన్న సూచించారు. మండలంలోని ఆలేరు తదితర గ్రామాల్లో రైతులు సాగు చేసిన అయిల్ పామ్ పంటలను శనివారం మరియన్న పరిశీలించారు.

రూ.2.8 లక్షల సైబర్ లూటీ



డోర్నకల్: సైబర్ వలలో పడి ఓ యువతి రూ.2.8 లక్షలు పోగొట్టుకున్న ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. డోర్నకల్ సీఐ బి.రాజేష్ శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. బొడ్రాయితండాకు చెందిన గుగులోత్ మౌనిక ఏప్రిల్ 8న ఇన్‌స్టాగ్రామ్‌లో లోన్ యాప్ డౌన్‌లోడ్ చేసుకుంది. లోన్‌యాప్ ప్రతినిధి రూ.10 లక్షల లోన్ మంజూరు చేస్తామని మొదట రూ.11 వేల పంపాలని కోరగా మౌనిక పంపింది. తర్వత మరో రూ.20వేలు పంపమని కోరడంతో మళ్లీ పంపించింది. లోన్ యాప్ ప్రతినిధి వారం రోజులపాటు మౌనికకు మాయ మాటలు చెబుతూ రూ.2.8 లక్షలు లూటీ చేశాడు. అనంతరం యాప్ ప్రతినిధి స్పందించకపోవడంతో మౌనిక డోర్నకల్ పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు మౌనిక ఖాతా నుంచి బదిలీ అయిన డబ్బులో రూ.7 వేలను హోల్డ్‌లో పెట్టారు. మౌనిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టినట్లు సీఐ తెలిపారు.

రుణం ఇప్పిస్తామని మోసం..

మహబూబాబాద్ రూరల్ : రుణం ఇప్పిస్తామని చెప్పిన ప్రకటనను నమ్మిన ఓ యువకుడు డబ్బులు బదిలీ చేయగా సైబర్ మోసగాళ్ల చేతిలో మోసపోయిన ఘటన శనివారం ఆలస్యంగా వెలుగు చూసింది. రూరల్ ఎస్సై దీపిక తెలిపిన వివరాల ప్రకారం .. మహబూబాబాద్ మున్సిపల్ పరిధిలోని ఈదుల పూసపల్లికి చెందిన ఆకుల యుగంధర్ ఫేస్ బుక్ ఖాతాకు జనవరిలో ధని యాప్ పేరిట రుణం ఇస్తామని సమాచారం వచ్చింది. దీంతో యుగంధర్ అవతలి వ్యక్తులు పంపించిన లింక్ ఓపెన్ చేశాడు. అనంతరం అవతలి వ్యక్తులు కోరినవిధంగా రూ.3వేలు, రూ.11,300, రూ.8,800, రూ.13,500 విడతల వారీగా పంపించాడు. డబ్బులు తిరిగి రాకపోవడంతో మోసానికి గురైనట్లు గ్రహించి 1930లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

రైల్వే లోకోపైలెట్ల గైర్హాజరుతో పది రైళ్లు రద్దు



కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్ కేంద్రంగా ప్రయాణిస్తున్న పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లతో పాటు, పుష్‌పుల్ ప్యాసింజర్ రైళ్లను లోకోపైలెట్ల గైర్హాజరుతో రద్దు చేసినట్లు రైల్వే అధికారులు శనివారం తెలిపారు. లోకో పైలెట్లు డిపార్ట్‌మెంటల్ పరీక్షలు రాస్తున్నందున ప్యాసింజర్ రైళ్లను నడిపించే వారి కొరత ఏర్పడిందని, దాంతో పలు ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్ రైళ్లను సికింద్రాబాద్ అధికారులు రద్దు చేసినట్లు పేర్కొన్నారు. కాగా, పలు రైళ్ల రద్దుతో పాటు వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు తీ వ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా పుష్ పుల్ ప్యాసింజర్ రైళ్లు రద్దు కావడంతో ఎక్స్‌ప్రెస్ రై ళ్లలో వెళ్లలేక సామాన్యులు ఇక్కట్లు పడుతున్నారు.

రద్దయిన ఎక్స్‌ప్రెస్ రైళ్లు

ఈనెల 16 నుంచి 19వ తేదీ వరకు కాజీపేట - బల్లార్షా (17035) వెళ్లే ఎక్స్‌ప్రెస్, ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకు బల్లార్షా - కాజీపేట (17036) వెళ్లే ఎక్స్‌ప్రెస్, కాజీపేట - సిర్పూర్ కాగజ్‌నగర్ (17003) వెళ్లే ఎక్స్‌ప్రెస్, బల్లార్షా - కాజీపేట (17004) వెళ్లే ఎక్స్‌ప్రెస్‌లు.

నిలిచిన పుష్‌పుల్ ట్రైన్స్

ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకు సికింద్రాబాద్ - వరంగల్ (67761) వెళ్లే పుష్‌పుల్, వరంగల్ - సికింద్రాబాద్ (67762) పుష్‌పుల్, సికింద్రాబాద్ - కా జీపేట (67763) పుష్‌పుల్, కాజీపేట - సికింద్రాబాద్ (67764) పుష్‌పుల్, డోర్నకల్ - కాజీపేట (67766) పుష్‌పుల్, కాజీపేట డోర్నకల్ (67765) పుష్‌పుల్ రైళ్లను రద్దు చేసినట్లు రైల్వే అధికారులు వివరించారు.

క్రైం ఏసీపీగా కిరణ్‌కుమార్ బాధ్యతల స్వీకరణ

రామన్నపేట: రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు వరంగల్ పోలీస్ కమిషనర్ క్రైం విభాగం నూతన ఏసీపీగా కిరణ్‌కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్‌ను అధికారులు, సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.

పుష్కరం.. పునీతం

నీళ్లారగిస్తున్న మహిళ



స్నానమాచరిస్తున్న భక్తుడు



చిన్నారితో కలిసి స్నానం చేస్తున్న మహిళ



దీపారాధన చేస్తున్న మహిళలు



ఉత్సవ విగ్రహానికి జలాభిషేకం



పుణ్యస్నానం చేస్తున్న యువతులు







ఆలయానికి వస్తున్న సచ్చిదానంద సరస్వతి స్వామి



అంతర్వాహినిలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు



కాళేశ్వరాలయంలో మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న వలంటీర్



సొమ్మసిల్లి పడిపోయిన భక్తుడు



పుష్కర ఘాట్‌కు స్నానమాచరించేందుకు వెళ్తున్న భక్తులు



పార్కింగ్ స్థలంలో నిలిపిన వాహనాలు



చిత్తడిగా మారిన ఘాట్ రోడ్డు



స్నానాలు చేస్తూ సెల్ఫీ దిగుతున్న భక్తులు

డిప్యూటీ సీఎం కాలసర్ప పూజలు



కాలసర్ప పూజలు చేస్తున్న భట్టి దంపతులు

కాటారం/కాళేశ్వరం: సరస్వతి పుష్కరాల్లో భాగంగా సరస్వతి ఘాట్ వద్ద రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తన సోదరుడు మల్లు ప్రసాద్‌తో కలిసి శనివారం తమ పితృదేవతలకు పిండప్రదానం చేశారు. అనంతరం పుష్కర స్నానం ఆచరించి కాళేశ్వర ముక్తీశ్వర ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా భట్టికి ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కుటుంబ సమేతంగా స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో కాలసర్ప నివారణ పూజలు, స్వామి వారికి క్షీరాభిషేకం చేశారు. ఆలయ పురోహితులు వేద మంత్రోచ్ఛరణల మధ్య డిప్యూటీ సీఎం దంపతులకు ఆశీర్వచనం చేసి స్వామి వారి ప్రసాదం అందజేశారు.

హోరాహోరీగా నెట్‌బాల్ పోటీలు




ట్రెడిషనల్ ఫైనల్‌లో నారాయణపేట (విన్నర్), కరీంగనర్ (రన్నర్) జట్లు

జనగామ: జనగామ జిల్లా కేంద్రంలోని బతుకమ్మ కుంటలో రాష్ట్రస్థాయి 8వ సబ్ జూనియర్ అండర్ -16 నెట్‌బాల్ చాంపియన్ షిప్ -2025 పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. రాష్ట్రంలోని 25 జిల్లాల నుంచి 620 మంది బాలబాలికలు హాజరయ్యారు. ట్రెడిషనల్, ఫాస్ట్ -5, మిక్స్‌డ్ నెట్‌బాల్ పోటీల్లో మూడు కేటగిరీల వారీగా క్రీడాకారులు తలపడుతున్నారు. ఇందులో ట్రెడిషనల్, ఫాస్ట్ -5 రెండు కేటగిరీలకు సంబంధించి బాలుర, బాలికల లీగ్, క్వార్టర్, సెమీ, ఫైనల్ మ్యాచ్‌లు ముగిశాయి. మిక్స్‌డ్ డబుల్ నెట్‌బాల్ పోటీలు శనివారం సాయంత్రం ప్రారంభమయ్యాయి.

రెండు కేటగిరీల్లో నారాయణపేట, మేడ్చల్ హవా

ట్రెడిషనల్, ఫాస్ట్ -5 నెట్‌బాల్ పోటీల్లో బాలుర, బాలికల విభాగంలో నారాయణపేట, మేడ్చల్ జిల్లాల హవా కొనసాగింది. ట్రెడిషనల్ నెట్ బాల్ బాలుర 8వ పోటీల్లో నారాయణపేట (విన్నర్), కరీంనగర్ (రన్నర్), హైదరాబాద్, ఖమ్మం (థర్డ్/సంయుక్తంగా), బాలికల విభాగంలో మేడ్చల్ (విన్నర్), నల్లగొండ (రన్నర్), జనగామ, ఖమ్మం (థర్డ్/సంయుక్తంగా) విజయకేతనం ఎగుర వేశాయి. ఫాస్ట్ -5 నెట్‌బాల్ బాలుర 4వ పోటీల్లో నారాయణపేట (విన్నర్), ఖమ్మం (రన్నర్), మహబూబ్‌నగర్, కొమురం భీం ఆసిఫాబాద్ (థర్డ్ /సంయుక్తంగా), బాలికల విభాగంలో మేడ్చల్ (విన్నర్), ఖమ్మం (రన్నర్), జనగామ, కొమురంభీం ఆసిఫాబాద్ (థర్డ్/సంయుక్తంగా) బరిలో దిగి గెలుపొందాయి. మిక్స్‌డ్ డబుల్ పోటీలు ఆదివారం సాయంత్రం ముగియనున్నాయి. ముగింపు వేడుకల్లో బహుమతులు ప్రదానం చేయనున్నారు.



ఫాస్ట్ -5 ఫైనల్‌లో గెలుపొందిన మేడ్చల్ బాలికల టీం

నేటి నుంచి జాయ్‌రైడ్స్



కన్నెపల్లి వద్ద సిద్ధంగా ఉన్న హెలికాప్టర్

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో జాయ్‌రైడ్స్‌కు ఆదివారం నుంచి హెలికాప్టర్ చక్కర్లు కొట్టనుంది. కన్నెపల్లిలోని లక్ష్మీ పంపుహౌస్ వద్ద భక్తులు విహంగ వీక్షణం చేయడానికి ఏవియేషన్ అధికారులు అందుబాటులోకి తీసుకువచ్చారు. యాత్రధామ్.ఓఆర్‌జీ యాప్‌లో ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాలని, జాయ్‌రైడ్స్, టెంట్‌సిటీ, దేవస్థానం పూజలను ఈ యాప్‌లో పొందుపర్చినట్లు వివరించారు. జాయ్‌రైడ్స్ బుకింగ్ కోసం ఒక్కరికి రూ.4,500తో 6 - 7 నిమిషాల పాటు గాలిలో చక్కర్లు కొట్టనున్నారు. కన్నెపల్లి హెలిపాడ్ వద్ద హెలికాప్టర్ సిద్ధంగా ఉంది. టెంట్‌సిటీకి ఒక రోజుకు రూ.3వేల వరకు తీసుకుంటున్నట్లు ప్రతినిధులు పేర్కొన్నారు.

ఎడ్ల బండ్లకు పెరిగిన గిరాకీ

భూపాలపల్లి అర్బన్: కాళేశ్వరం పుష్కరాల్లో భాగంగా సరస్వతి ఘాట్ వద్ద ఎడ్ల బండ్లకు గిరాకీ పెరిగింది. శుక్రవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షం కారణంగా రోడ్లన్నీ బురదమయంగా మారాయి. దాంతో బురద రోడ్లపై వాహనాలు ముందుకు సాగక భక్తులు ఇబ్బందులు పడ్డారు. కార్లు, వాహనాలను దూరంగా పార్కింగ్ చేసి కాలినడకన వెళ్లలేక ఎడ్ల బండ్లను ఆశ్రయించారు. ఎడ్లబండ్ల యజమానులు ఒక్కరికి రూ.50 చొప్పున చార్జీ వసూలు చేస్తున్నారు.

పితృ దేవతలకు పిండ ప్రదానాలు

- సరస్వతి నది పుష్కరాల్లో సమర్పణ
- పుష్కరాల్లో పెద్దలకు సమర్పిస్తే మోక్షం
- వారి ఆత్మలు శాంతిస్తాయని భక్తుల నమ్మకం



గోదావరి నది తీరంలో పితృ దేవతలకు పిండ ప్రదానం చేస్తున్న భక్తులు

కాటారం: కాళేశ్వరంలో కొనసాగుతున్న సరస్వతి పుష్కరాల్లో భక్తులు పుష్కర స్నానం, ప్రత్యేక పూజలతో పాటు పిండ ప్రదానాలు, పితృ తర్పణాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. పన్నెండేళ్లకు ఒకసారి ఒక్కో నదికి వచ్చే పుష్కరంలో పితృదేవతలకు సమర్పణ ఆనవాయితీగా వస్తోంది. ఒక్కో రాశి బృహస్పతి (గురువు)లో ప్రవేశించడంతో ఒక్కో నదికి ఒక్కో ఏడాది పుష్కరం వస్తుంది. ఇలా 12 నదులకు 12 ఏళ్లకు ఒకసారి పుష్కరాలు వస్తుంటాయి. ఈ పుష్కరాల్లో స్నానం ఆచరిస్తే సకల రోగపీడలు తొలగిపోతాయని భక్తులు విశ్వసిస్తారు. అంతేకాకుండా, తమ కుటుంబంలో కాలం చేసిన పితృదేవతలకు పిండ ప్రదానాలు, పితృ తర్పణాలు సమర్పిస్తే వారి ఆత్మకు శాంతి కలిగి మోక్షం చేకూరుతుందని భక్తులు నమ్ముతారు. ఈ ఏడాది మిథున రాశి బృహస్పతిలో ప్రవేశించడంతో కాళేశ్వరంలో అంతర్వాహినిగా కొనసాగుతున్న సరస్వతి నదికి పుష్కరాలు వచ్చాయి. పన్నెండు రోజుల పాటు కొనసాగనున్న పుష్కర వేడుకలకు తెలంగాణ, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌తో పాటు పలు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. త్రివేణి సంగమంలో పుష్కర స్నానం ఆచరించడంతో పాటు పురోహితుల సమక్షంలో పితృదేవతలకు పిండ ప్రదానాలు, పితృ తర్పణాలు చేసి నదిలో సంకల్పాలు చేస్తున్నారు. ప్రతీ పుష్కరంలో నది తీరాన ముప్పై మూడు కోట్ల దేవతలతో పాటు పితృదేవతలు మచ్ఛ రూపంలో కొలువై ఉంటారని పురోహితులు, వేద బ్రహ్మణులు చెబుతున్నారు. ప్రతీ నది పుష్కరంలో పితృదేవతలకు పిండ ప్రదానాలు, పితృ తర్పణాలు చేయడం వల్ల వారికి మోక్షం కలుగుతుందని పేర్కొంటున్నారు.

పితృ దేవతలను స్మరించుకుంటూ..



గతంలో జరిగిన గోదావరి, ప్రాణహిత పుష్కరాల్లో పాల్గొని మా పితృదేవతలను స్మరించుకుంటూ పిండ ప్రదానం, సంకల్పం చేశాను. ఇప్పుడు కూడా మా పెద్దలకు పిండ ప్రదానం గావించాను. పురోహితుడి ఆధ్వర్యంలో మా పెద్ద పేరు మీదుగా సమర్పణ కార్యక్రమం జరిపించాను.

\- బీరాసింగ్, నిజామాబాద్

పెద్దల ఆశీస్సులు ఉండాలని..



స్వర్గస్తులైన మా పితృ దేవతల ఆశీస్సులు మా కుటుంబ సభ్యులపై ఎల్లవేళలా ఉండాలని వారికి పిండ ప్రదాన కార్యక్రమం జరిపించాను. వారు మా మధ్య లేకపోవడంతో బాధాకరం. అయినప్పటికీ వారిని స్మరించుకొని పిండప్రదానం చేయడం వల్ల కొంతమేర బాధ తొలగిపోయింది.

\- సుధాకర్, హనుమకొండ

పితృ దేవతలకు స్వర్గలోక మోక్షం..



ఒక్కో రాశి ఒక్కో ఏడాది గురుడులోకి ప్రవేశిస్తుంది. దాంతో 12 నదులకు ఒక్కో ఏడాది పుష్కరం వస్తుంది. ఈ పుష్కరాల సమయంలో కోట్లాది దేవతలతో పాటు పితృదేవతలు నదీతీరంలో ఉంటారు. కాలం చేసిన పితృదేవతలకు ఈ సమయంలో పిండ ప్రదానం, పితృ తర్పణాలు చేస్తే వారికి స్వర్గలోక మోక్షం కలుగుతుందని పురాణాలు చెబుతున్నాయి. ఈక్రమంలో ప్రతీ పుష్కరంలో పితృదేవతల పేరిట పూజలు చేయడం శుభప్రదం.

\- వెంకటశివయ్య, పురోహితుడు, శ్రీశైలం

ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించిన కలెక్టర్ రాహుల్, ఎస్పీ కిరణ్



బైక్‌పై వెళ్తున్న కలెక్టర్, ఎస్పీ

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో సరస్వతి నది పుష్కరాల సందర్భంగా మూడో రోజు కాళేశ్వరానికి భక్తుల రద్దీ పెరిగింది. శనివారం వివిధ ప్రాంతాల నుంచి వాహనాల్లో కాళేశ్వరం బయలుదేరగా మహదేవపూర్ - కాళేశ్వరం రహదారిలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈక్రమంలో వాహనాలను క్రమబద్ధీకరించేందుకు కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ బైక్‌పై తిరుగుతూ వాహనాలను పంపించి రూట్ క్లియర్ చేశారు. కాగా, శని, ఆది వారాల్లో భక్తుల రద్దీ తీవ్రంగా ఉంటుందని అంచనా వేసి యంత్రాంగాన్ని వారు అప్రమత్తం చేశారు.

ప్రపంచంతో పోటీపడేలా ప్రభుత్వ పాలన

- సరస్వతి పుష్కరాల నిర్వహణ భేష్
- ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రి తుమ్మల



పూజలు చేస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ రఘురామిరెడ్డి, తదితరులు

కాటారం/కాళేశ్వరం: సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో రాష్ట్రం ప్రపంచంతో పోటీపడేలా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన కొనసాగిస్తోందని, ముక్తీశ్వర స్వామి ఆశీర్వాదం ఉంటే మరింత ముందుకు వెళ్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర వ్యవసాయ, చేనేత, జౌళి, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. కాళేశ్వరంలో కొనసాగుతున్న సరస్వతి నది పుష్కరాల్లో భాగంగా ఉప ముఖ్యమంత్రి, మంత్రి, ఖమ్మం ఎంపీ రఘురామిరెడ్డి వేర్వేగా శనివారం పుష్కర స్నానం ఆచరించి సరస్వతి అమ్మవారు, కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రి తుమ్మల వేర్వేరుగా విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా పుష్కరాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పన్నెండేళ్లకు ఒకసారి వచ్చే పుష్కరాలు ఎంతో పవిత్రమైనవని, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పుష్కర స్నానాలు ఆచరించాలని సూచించారు. రాష్ట్రంలో గోదావరి పుష్కరాలు భారీగా నిర్వహించడానికి ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణ రావు, మక్కాన్‌సింగ్, కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరే, అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, భూపాలపల్లి ఆర్డీఓ రవి, దేవాదాయశాఖ ఆర్జేసి రామకృష్ణారావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పుష్కర సంబురం

- సరస్వతి నదిలో మూడోరోజు లక్షన్నర మంది స్నానాలు
- పిండ ప్రదానాలు, పితృ దేవతలకు తర్పనాలు

భూపాలపల్లి/కాళేశ్వరం: సరస్వతి నదికి జనం పుష్కర హారతి పట్టారు. సరస్వతి నది పుష్కరాల్లో భాగంగా శనివారం మూడో రోజు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి భారీగా భక్తులు కాళేశ్వరానికి పోటెత్తారు. గోదావరి, ప్రాణహిత, అంతర్వాహిని సరస్వతి నదిలో పుష్కర పుణ్యస్నానాలు ఆచరించారు. పిండప్రదాన పూజలు చేశారు. పితృ దేవతలకు తర్పనాలు నిర్వహించారు. నదీమాతకు చీర, సారెను సమర్పించారు. ముత్తయిదువలు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు.

ట్రాఫిక్‌తో ఇబ్బందులు

శుక్రవారం రాత్రి గాలి దుమారం, ఉరుములుమెరుపులతో కూడిన భారీ వర్షం రెండు గంటల పాటు దంచి కొట్టింది. దీంతో కాళేశ్వరంలోని పుష్కరాల ఫ్లెక్సీ బోర్డులు, భారీ హోర్డింగ్‌లు నేలమట్టమయ్యాయి. సరస్వతి ఘాట్‌లో ఏర్పాటు చేసిన స్టాళ్లు, చలువ పందిళ్లు, డార్మెటరీ హౌస్ టెంట్లు కూలిపోయాయి. 120 ఎకరాల నల్లరేగడి భూముల్లో ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలాలు బురదగా మారి వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దీంతో ఇప్పలబోరు, బస్టాండ్ సమీపంలో పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశారు. మంత్రి శ్రీధర్‌బాబు పరిస్థితులను పర్యవేక్షించి వెంటనే అధికారులతో మరమ్మతులు చేయించారు.

వీకెండ్‌తో రద్దీ

వీకెండ్ కావడంతో రద్దీ పెరిగింది. దీంతో 16 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామైంది. కార్లు, ఆర్టీసీ బస్సుల్లో వచ్చిన భక్తులు కాలినడకన కాళేశ్వరం చేసుకున్నారు. తాగునీరు లేక ఎండవేడికి తట్టుకోలేక పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరే బైక్‌పై తిరుగుతూ ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామికి పూజలు

తెల్లవారుజామునుంచి భారీగా భక్తులు త్రివేణి సంగమంలోని సరస్వతి నదిలో పుష్కర స్నానాలు ఆచరించారు. శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామి ఆలయంలో క్యూలైన్లు భక్తులతో కిక్కిరిసిపోయాయి. గంటల తరబడి నిలబడి స్వామివారిని దర్శనం చేసుకున్నారు. శనివారం ఒక్కరోజు లక్షన్నర మంది వరకు భక్తులు పుష్కర స్నానాలు చేసి, దర్శనాలు చేసుకున్నట్లు అంచనా. క్యూలైన్‌లో మంచిర్యాలకు చెందిన భక్తుడు సొమ్మసిల్లిపోయాడు. అతడిని అక్కడే ఉన్న వ్యక్తులు వెంటనే ఆస్పత్రికి తరలించారు.

నదీహారతికి భక్తుల తాకిడి

సరస్వతి ఘాట్‌లో రాత్రి కాశీపండితులు ఏర్పాటు చేసిన నవరత్నమాలిక (నదీహారతి) హారతికి భక్తులు భారీగా వచ్చారు. ఏడు గద్దెలపై ఏర్పాటు చేసిన విద్యుత్ వెలుగుల్లో ప్రత్యేకంగా 9 హారతులు ఇచ్చారు.

ప్రముఖుల పూజలు

పుష్కరాలకు ప్రముఖుల తాకిడి రోజురోజుకూ పెరుగుతోంది. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క శుక్రవారమే పుష్కరస్నానం ఆచరించగా శనివారం పితృదేవతలకు పిండప్రదానం చేశారు. అదేవిధంగా రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్, తుని తపోవనం పీఠాధిపతి సచ్చిదానందసరస్వతిస్వామి పుష్కర స్నానాలు చేశారు. స్వామివారి ఆలయంలో అభిషేకాలు, పూజలు చేశారు.